
టార్గెట్.. టెన్త్!



- పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం పెంచేలా ప్రత్యేక తరగతులు
- ఉదయం–సాయంత్రం స్టడీ అవర్స్
- రోజూ పరీక్షలు
- విద్యార్థులకు వంద రోజుల ప్రణాళిక
- మార్చి 17 నుంచి 31 వరకు పబ్లిక్ పరీక్షలు



తనకల్లు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్టడీ అవర్‌లో విద్యార్థులు

తనకల్లు: ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా పదో తరగతి ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను విద్యాశాఖ సమాయత్తం చేస్తోంది. ఉత్తమ ఫలితాల సాధనకు ఉపాధ్యాయులు ముందస్తు వ్యూహాలతో సిద్ధమయ్యారు. పబ్లిక్ పరీక్షలు అంటేనే విద్యార్థుల్లో ఒక రకమైన భయం ఏర్పడుతుంది. విద్యార్థుల్లో భయాన్ని పోగొట్టి మంచి ఫలితాలను సాధించాలనే సంకల్పంతో విద్యాశాఖ ప్రణాళికాబద్ధంగా ముందుకెళుతోంది. ఇందులో భాగంగా 2025 మార్చిలో జరగబోయే టెన్త్ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేస్తోంది. విద్యార్థుల్లో ఉన్న భయాన్ని పోగొట్టి వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ప్రత్యేక ప్రణాళిక తయారు చేసింది. మార్చి 17 నుంచి 31 వరకు పబ్లిక్ పరీక్షలు జరగనుండడంతో ప్రతి విద్యార్థి మంచి మార్కులతో ఉత్తీర్ణులయ్యేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నారు. డిసెంబర్ 1 నుంచి రోజూ ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ప్రత్యేకంగా స్టడీ అవర్స్ తరగతులను నిర్వహిస్తున్నారు. అలాగే రోజూ పబ్లిక్ తరహాలో ఆయా సబ్జెక్టుల్లో పరీక్షలు రాయిస్తున్నారు. ముందుగా ప్రకటించిన 100 రోజుల ప్రత్యేక ప్రణాళిక ప్రకారం ఆయా స్కూళ్లలో ఉపాధ్యాయులు విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నారు.

వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

మండలంలో గిరిజన బాలికల గురుకుల పాఠశాల, కేజీబీవీ పాఠశాలలో పాటు మరో ఆరు ప్రభుత్వ , జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో మొత్తం 311 మంది విద్యార్థులు ఈ ఏడాది పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరుకానున్నారు. పబ్లిక్ పరీక్షలకు మూడు నెలల సమయం మాత్రమే ఉండడంతో ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థిపై ప్రత్యేక దృష్టి సారించి వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేస్తున్నారు. ఆయా సబ్జెక్టు టీచర్లు విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేస్తూ వారి సందేహాలను ఎప్పటికప్పుడు తీర్చి అవగాహన కల్పిస్తున్నారు. రోజూ పబ్లిక్ తరహాలో పరీక్షలను నిర్వహించి విద్యార్థుల్లో భయాన్ని తొలగించి వారిలో ఆత్మ విశ్వాసాన్ని పెంపొందిస్తున్నారు. ఉపాధ్యాయులు వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి తగిన సమయాన్ని కేటాయించి అన్ని సబ్జెక్టుల్లో మెరుగైన ఫలితాల సాధనకు కృషి చేస్తున్నారు.

పరీక్షలంటే భయం పోయింది



పాఠశాలలో ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. ఇప్పటికే సిలబస్ పూర్తయింది. రివిజన్ చేసుకుంటున్నాం. మా సార్లు రోజూ పరీక్షలను నిర్వహిస్తుండడంతో పరీక్షలంటే భయం పోయింది. మంచి మార్కులతో పాస్ అవుతాననే నమ్మకం ఉంది.

– భవిత, విద్యార్థిని, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, తనకల్లు

ప్రత్యేక తరగతులు ఉపయోగకరం



టెన్త్ పబ్లిక్ పరీక్షలలో మంచి మార్కులు సాధించాలనే లక్ష్యంతో చదువుతున్నాను. స్కూల్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక తరగతులు చాలా ఉపయోగంగా ఉన్నాయి. సబ్జెక్టు టీచర్లు అందుబాటులో ఉండి విద్యార్థుల సందేహాలను అక్కడికక్కడే నివృత్తి చేస్తున్నారు.

– విష్ణువర్ధన్, విద్యార్థి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, తనకల్లు

వంద రోజుల ప్రణాళిక

వంద రోజుల ప్రణాళికతో విద్యార్థులను పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నాం. అలాగే సబ్జెక్టు ఉపాధ్యాయుల ప్రతి విద్యార్థిపై వ్యక్తిగతంగా శ్రద్ధ తీసుకొని పరీక్షలకు సిద్ధం చేస్తున్నాం. ఎప్పటికప్పుడు పరీక్షల పెట్టి విద్యార్థుల సామర్థ్యాన్ని తెలుసుకుంటున్నాం. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాం. విద్యార్థులు మంచి మార్కులతో పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం.

– హరిప్రసాద్‌రెడ్డి, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం, తనకల్లు

అధ్వానంగా పరాకువాండ్లపల్లి రోడ్డు



బురదమయమైన రోడ్డును చూపుతున్న కాలనీ వాసులు

తనకల్లు: పరాకువాండ్లపల్లి ఎస్ఎల్ఎస్ ఫ్యాక్టరీ నుంచి సివిల్ సప్లయీస్ గోడౌన్‌కు వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. ఇక్కడ దాదాపు 30 గిరిజన, దళిత కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. అయితే ఇటీవల కురిసిన వర్షాలకు మట్టిరోడ్డు పూర్తిగా బురదమయమైంది. అడుగు తీసి అడుగ వేయలేని పరిస్థితి నెలకొందని కాలనీ వాసులు వాపోతున్నారు. బురదతో రొచ్చు రొచ్చుగా తయారైన రోడ్డుపై వృద్ధులు, పిల్లలు నడుస్తూ జారి కిందపడి గాయాలపాలవుతున్నట్లు పేర్కొన్నారు. దీంతో ఇళ్లలో నుంచి బయటకు రాలేకపోతున్నామన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన సివిల్ సప్లయీస్ గోడౌన్‌కు నిత్యం ట్రాక్టర్లు, లారీలు రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే బురద బురద మారిన రోడ్డుపై వాహనాలు సైతం ఇరుక్కపోతున్నాయని చెబుతున్నారు. ఫ్యాక్టరీ నుంచి గోడౌన్ వరకు సిమెంట్ లేదా తారురోడ్డు వేయాలని అధికారులు, నాయకుల దృష్టికి ఎన్నోసార్లు తీసుకుపోయినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కుల గణనపై అప్రమత్తంగా ఉండండి



విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ నాయకులు, కార్యకర్తలు

తాడిమర్రి: రాష్ట్రంలో జరుగుతున్న మాదిగల కుల గణనపై అప్రమత్తంగా ఉండాలని పెద్దఓబిలేసు మాదిగలకు సూచించారు. స్థానిక ఎస్సీ కాలనీలో ఆదివారం ఆయన వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ నాయకులు, కార్యకర్తలతో కలసి ఆయన విలేకరులతో మాట్లాడారు. మాదిగల కుల గణనలో అధికారులకు పూర్తి సమాచారం ఇవ్వాలన్నారు. మాదిగలు తాము చర్చిలకు వెళుతున్నామని చెబితే అధికారులు మతం క్రిష్టియన్‌గా నమోదు చేస్తే రిజర్వేషన్ కేటగిరిలో బీసీ–సీగా పరిగణిస్తారన్నారు. దీంతో ఇటు వారి కుటుంబం నష్టపోవడమే కాక మాదిగల సంఖ్య తక్కువ చూపడంతో సామాజికంగా, రిజర్వేషన్ పరంగా తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. కన్వర్టెడ్ క్రిష్టియన్లను మాత్రమే క్రిష్టియన్లుగా నమోదు చేసుకోవాలని ఆయన అధికారులను కోరారు. ఎస్సీసెల్ నాయకులు బండారు నాగభూషణం, గుజ్జల శ్రీనివాసులు, ఎం.దిలీప్ కుమార్, పన్నూరు నల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం



ఏకపాదంపల్లిలో శ్రీవారు, శ్రీదేవి, భూదేవిలకు కల్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

తాడిమర్రి: ఏకపాదంపల్లిలో వెలసిన పురాతన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం లక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ధనుర్మాసం బహుళ చతుర్దశిని పురస్కరించుకుని పిన్నదరి గ్రామానికి చెందిన వేద పండితులు వెంకటేశ్వరశాస్త్రి ఆధ్వర్యంలో మంగళ వాయిద్యాలు, వేదమంత్రాల నడుమ శ్రీలక్ష్మీనరసింహస్వామి, శ్రీదేవి, భూదేవిల కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. ముందుగా వేద పండితులు స్వామి మూలవిరాట్‌కు వెండి ఆభరణాలు తొడిగి, పలు రకాల పూలమాలలతో అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు మహా మంగళ హారతులు నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం గ్రామపెద్దలు గ్రామంలో అందంగా అలంకరించిన ఉత్సవ పల్లకీలో శ్రీవారు, శ్రీదేవి, భూదేవిల ఉత్సవ విగ్రహాలను ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అడుగడుగున భక్తులు స్వామికి కొబ్బరి కాయలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

కొత్త ఏడాదిని మద్యంతో ప్రారంభించొద్దు



నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న జనవిజ్ఞాన వేదిక నాయకులు

ధర్మవరం అర్బన్: నూతన సంవత్సరాన్ని మద్యం, మాదక ద్రవ్యాలతో ప్రారంభించొద్దని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఆడిట్ కన్వీనర్ సాకే భాస్కర్ కోరారు. పట్టణంలోని సూర్య స్కూల్‌లో ఆదివారం జనవిజ్ఞానవేదిక సభ్యులు నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సాకే భాస్కర్, జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆదిశేషు మాట్లాడుతూ సరదాగా ప్రారంభించిన దురలవాట్లే మనిషి జీవితాన్ని నాశనం చేస్తాయన్నారు. రాష్ట్రంలో అక్టోబర్ 16 నుంచి డిసెంబర్ 9 నాటికి రూ.4677 కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయన్నారు. నెల్లూరులో ప్రారంభమైన సారా వ్యతిరేక పోరాటం వెనుక జనవిజ్ఞాన వేదిక ఉందన్నారు. ప్రభుత్వాలు కుట్ర మూలంగా నిర్వీర్యమైందన్నారు. జేవీవీ జిల్లా అధ్యక్షుడు మహేంద్రరెడ్డి మాట్లాడుతూ ఏదో ఒక సాకుతో మద్యం, మాదక ద్రవ్యాలకు అలవాటు పడకూడదన్నారు. భవిష్యత్తును ఆలోచించాలని, కుటుంబ సభ్యుల గురించి ఆలోచించాలని సూచించారు. జేవీవీ జిల్లా కార్యదర్శి హరి, వైద్యులు డాక్టర్ విక్రాంత్, సుధాకర్‌రావు, జేవీవీ నాయకులు బాలగంగాధర్ నాయక్, రామకృష్ణ, లక్ష్మినారాయణ, బాబు, లక్ష్మినారాయణరెడ్డి, లోకేష్, నరేంద్రబాబు, సురేష్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న డీఎస్పీ శివనారాయణస్వామి

కదిరి టౌన్: పట్టణంలో నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఎవరైనా పోలీసులు నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ శివనారాయణస్వామి హెచ్చరించారు. ఆదివారం సాయంత్రం ఆయన పట్టణ పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. డిసెంబర్ 31 రాత్రి యువకులు మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. కొత్త సంవత్సరాన్ని ప్రశాంత వాతావరణంలో సంతోషంగా జరుపుకోవాలని సూచించారు. బహిరంగ ప్రదేశాలు, రోడ్లపై ఎటువంటి వేడుకలు అనుమతులు లేదన్నారు. రాత్రి 10 గంటల తరువాత రోడ్లపై రావొద్దని సూచించారు. ర్యాష్ డ్రైవింగ్, బైక్ రేసులు, ద్విచక్రవాహనాలకు సైలెన్సర్లు తీసివేసి పెద్ద శబ్దాలతో ప్రజలు ఇబ్బందులు కలిగేలా ప్రవర్తిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తల్లిదండ్రులు వారి పిల్లలు పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. సీఐ వి.నారాయణరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా డీఎస్సీ టాలెంట్ టెస్ట్



పరీక్షను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ రామకృష్ణ

పుట్టపర్తి టౌన్: వదాన్య సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం కొత్తచెరువులో నిర్వహించిన డీఎస్సీ ఎస్జీటీ టాలెంట్ టెస్ట్ –2024 ప్రశాంతంగా ముగిసింది. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా డీఎస్సీ ఎస్జీటీ అభ్యర్థుల కోసం టెస్ట్ నిర్వహించారు. జిల్లా నలుమూల నుంచి 1,100 మంది అభ్యర్థులు హాజరయ్యారు. బుక్కపట్నం డైట్ కాలేజ్ ప్రిన్సిపాల్ రామకృష్ణ పర్యవేక్షణలో ఐదు పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. కొత్తచెరువు సీఐ ఇందిర పరీక్ష కేంద్రాలను పరిశీలించారు.పరీక్ష నిర్వహణకు సహకరించిన ప్రభుత్వ, పోలీస్ యంత్రాంగానికి వదాన్య ఫౌండర్ అశోక్ పడపాటి కృతజ్ఞతలు తెలిపారు. పరీక్ష ఫలితాలను జనవరి 15న విడుదల చేస్తామన్నారు. జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి టాలెంట్ టెస్ట్‌కు అభ్యర్థులు హాజరు కావడంతో కొత్తచెరువులో సందడి నెలకొంది.

17న మున్సిపల్ రూముల వేలం

ధర్మవరం: పట్టణంలోని గాంధీ పార్కు మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లోని 11 షాపు రూములను జనవరి 17న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ ఆదివారం తెలిపారు. గతంలో ఈనెల 30న నిర్వహిస్తామని ప్రకటించామని, ప్రస్తుతం వేలాన్ని జనవరి 17కు వాయిదా వేశామన్నారు. ఆసక్తి ఉన్న వారు మున్సిపల్ కార్యాలయం ఆవరణలో జరిగే వేలంలో పాల్గొనాలని సూచించారు.

సంక్షిప్త సమాచారం

వడ్డెర సంక్షేమ సంఘం మండల కమిటీ ఎంపిక

ముదిగుబ్బ: వడ్డెర సంక్షేమ సంఘం మండల కమిటీని ఆదివారం ఎంపిక చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆ సంఘం సీనియర్ నేత ఎర్రవంకపల్లి గంగులప్ప హాజరయ్యారు. మండల అధ్యక్షుడిగా కేతన ప్రభాకర్, కార్యదర్శిగా గోగుల లక్ష్మినారాయణ, సంయుక్త కార్యదర్శిగా దేరంగుల వేమయ్య, సభ్యులుగా రాజశేఖర్, రామాంజనేయులు, నాగరాజును ఎంపిక చేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు శ్రీరాములు, నారాయణ, పుల్లప్ప, రాజన్న, కేశవయ్య, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకం అనర్థదాయకం

పుట్టపర్తి అర్బన్: విచక్షణారహితంగా ప్లాస్టిక్ వాడకం అనర్థదాయకమని ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, తిరుపతి ఎస్వీ వ్యవసాయ కళాశాల విద్యార్థులు పేర్కొన్నారు. ఆదివారం తిరుపతి ఎస్వీ వ్యవసాయ కళాశాల విద్యార్థులు పుట్టపర్తి మండలం జగరాజుపల్లిలో జాతీయ సేవా పథకంలో భాగంగా గ్రామస్తులతో కలిసి ప్లాస్టిక్ వాడకంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ గణేష్‌కుమార్ మాట్లాడుతూ ప్లాస్టిక్ భూమిలో కుళ్లిపోదని దీని ద్వారా ఎన్నో అనర్థాలు వస్తాయన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించాలన్నారు. దీన్ని పశువులు తిన్నా అరగక కడుపులో పేరుకొని మృత్యువాత పడతాయన్నారు. వస్తువులను కొనుగోలు చేయడానికి వెళ్లే సమయంలో జనపనార బ్యాగులను తీసుకెళ్లాలని సూచించారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

పుట్టపర్తి అర్బన్: బీడుపల్లి తండా సమీపంలో పేకాట ఆడుతున్న ఐదుగురిని ఆదివారం అరెస్టు చేసినట్లు పుట్టపర్తి రూరల్ ఎస్సై లింగన్న తెలిపారు. నిందితుల నుంచి రూ.15,100 స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఏకల్ ఆచార్యజీ, మాతాజీలకు శిక్షణ

తలుపుల : సంగటివారిపల్లి గ్రామంలో ఏకల్ ఆచార్యజీ, మాతాజీలకు ఆదివారం సంచ్ సమితి అధ్యక్షుడు ఓబులరెడ్డి, సైన్స్ ఓబులరెడ్డి, మనోహర్‌రెడ్డి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నేటి విద్యార్థులకు విద్యతో పాటు సంస్కృతి, సంప్రదాయాలు, ధర్మంపై వివరించాలన్నారు. జిల్లా అధ్యక్షుడు రాధాకృష్ణ మాతాజీ, ఆచార్యాజీలకు ఆచార్య మార్గదర్శి సిలబస్ పుస్తకాలు, డైరీలు అందజేశారు. కార్యక్రమంలో ఆచార్యజీలతో పాటు, సభ్యులు వెంకటనారాయణ, గంగిరెడ్డి, మహేష్ పాల్గొన్నారు.

స్నేహభావంతో మెలగాలి



మాట్లాడుతున్న టూటౌన్ సీఐ రెడ్డప్ప

ధర్మవరం: కాలనీల్లోని ప్రజలంతా స్నేహభావంతో మెలగాలని టూటౌన్ సీఐ రెడ్డప్ప సూచించారు. పట్టణంలోని ఇందిరమ్మకాలనీలో ఆదివారం పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా కాలనీవాసులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తమ హక్కులను తెలుసుకుని చట్టం మేరకు నడుచుకోవాలన్నారు. ఎవరూ గొడవలకు పాల్పడరాదని సూచించారు. బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని తెలిపారు. ఎవరైనా కాలనీల్లో గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఈ–కేవైసీ చేయించుకోండి

ఓడీచెరువు: అల్లాపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కంప్యూటరైజేషన్‌లో భాగంగా సొసైటీ సభ్యులు తప్పనిసరిగా ఈ–కేవైసీ చేయించుకోవాలని సొసైటీ సీఈఓ రామాంజనేయులు కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ–కేవైసీ చేయించుకోని పక్షంలో ప్రభుత్వం నుంచి రాయితీలు, పథకాలు, బీమాలాంటివి వర్తించవని తెలిపారు.

క్లుప్తంగా

కార్మిక చట్టాలు పక్కాగా అమలు చేయాలి



మాట్లాడుతున్న వెంకటేష్

పుట్టపర్తి: రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు కార్మిక చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కన్వీనర్ ఓబిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేష్ డిమాండ్ చేశారు. ఆదివారం బుక్కపట్నం ఎమ్మార్సీ ఆవరణలో కార్మిక చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాల్లో మార్పులు చేసి బడా పారిశ్రామికవేత్తలకు ఊడిగం చేస్తోందన్నారు. రాష్ట్రంలో సైతం కనీస వేతనాల సవరణ జరగటం లేదని విమర్శించారు. కార్మికులు సంఘటితం కాక పోవటం వల్లే ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. కార్మికులను సంఘటితం చేసి పోరాటాలకు సిద్ధం కావాలని వారు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు కార్మికులకు అండగా ఉంటామని నమ్మించి తీరా అధికారంలోకి వస్తూనే వారిపై కత్తి కట్టి అనేక మందిని తొలగించిందన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ బ్యాల్ల అంజి, నేతలు మణెమ్మ, మంజుల, రాందాస్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'

బత్తలపల్లి: తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ఉంటుందని తహసీల్దార్ స్వర్ణలత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల అధికారులు ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తారన్నారు. మండలస్థాయిలో జరిగే ఈ కార్యక్రమానికి మండలస్థాయి అధికారులందరూ హాజరు కావాలని సూచించారు. ప్రజలు ఏవైనా సమస్యలుంటే వినతి పత్రాలను అందజేయవచ్చన్నారు.

కంటి వైద్యశిబిరం అభినందనీయం



మాజీ క్రికెటర్ ప్రసాద్‌రెడ్డిని సన్మానిస్తున్న ఆదిశేషారెడ్డి, సర్పంచ్ నరేందర్రెడ్డి తదితరులు

పుట్టపర్తి: కొత్తచెరువు మండలం కేశాపురంలో దివంగత హింది పండిట్ మొర్రెడ్డి గారి నాగిరెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారులు ఆదిశేషారెడ్డి(ఎన్ఆర్ఐ), పురుషోత్తమరెడ్డి ఉచిత కంటి వైద్యశిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని వెటరన్ రంజీ క్రికెటర్ ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన శిబిరాన్ని సందర్శించారు. కంటి పరీక్షలను పరిశీలించడంతోపాటు అందుతున్న వైద్యంపై రోగులను అడిగి తెలుసుకున్నారు. బస్సులో ఏర్పాటు చేసిన అధునాతన ఆపరేషన్ థియేటర్‌ను పరిశీలించారు. రెండో జరిగిన శిబిరంలో 250 మందికి పరీక్షలు చేశారని, జనవరి 3 వరకూ శిబిరం కొనసాగుతుందని ఆదిశేషారెడ్డి తెలిపారు. అనంతరం ఆదిశేషారెడ్డి,సర్పంచ్ నరేందర్రెడ్డి ప్రసాద్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి



వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ ప్రభాకర్

బత్తలపల్లి: వాహనదారులు వాహనాల రికార్డులను కలిగి ఉండటంతోపాటు తప్పనిసరిగా రోడ్డు నియమాలను పాటించాలని ధర్మవరం రూరల్ సీఐ ప్రభాకర్ పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం బత్తలపల్లి కూడలి వద్ద సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు నియమాలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చన్నారు. రోడ్డు భద్రత మన అందరి బాధ్యతని పేర్కొన్నారు. ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను తరలించరాదన్నారు.

కంది పంట దక్కేనా?



రాఘువంపల్లి వద్ద ఏపుగా పెరిగి, పూత పట్టిన కంది పంట

బత్తలపల్లి: మండలంలో ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన కంది పంట చేతికి దక్కేనా అని రైతులు ఎదురుచూస్తున్నారు. మండలవ్యాప్తంగా 6,020 ఎకరాల్లో పంట సాగు చేశారు. కందికి పూత బాగా వచ్చినప్పటికీ చలి ప్రభావం కారణంగా పూత రాలిపోతుందన్న భయం రైతుల్లో నెలకొంది. దీనికి తోడు ఇటీవల వరుస తపాన్లు కూడా పంటపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎండ ఎంత బాగా కాస్తే అంత దిగుబడి వస్తుందని పేర్కొంటున్నారు. ఉదయం మంచు ప్రభావం , చలి అధికంగా ఉండడంతో పంట చేతికి దక్కుతుందో లేదోనన్న భయం నెలకొంది.

నేడు కోడేకండ్లలో సివిల్ రైట్స్ డే

బత్తలపల్లి: కోడేకండ్ల గ్రామంలో సోమవారం సివిల్ రైట్స్ డే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ షణ్ముఖకుమార్ యాదవ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామంలోని ఎస్సీ కాలనీ ఆర్డీటీ కమ్యూనిటీ హాల్‌లో కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. ప్రజలకు ప్రాథమిక హక్కులు, చట్టాలపై అవగాహన కలిస్తామని, అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

ఘనంగా సీపీఐ ఆవిర్భావ దినోత్సవం



ఆవిర్భావ దినోత్సవం నిర్వహిస్తున్న నాయకులు

తలుపుల : స్థానిక ఆటో స్టాండ్ వద్ద ఆదివారం శత 100వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సీపీఐ మండల కార్యదర్శి ఈశ్వరయ్య, కౌన్సిల్ సభ్యులు హసాన్ ఆధ్వర్యంలో పార్టీ జెండా ఎగురవేశారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులు, కర్షకులు, బడుగు బలహీన వర్గాల కోసం అహర్నిశలూ పాటుపడేది సీపీఐ పార్టీ మాత్రమేనన్నారు. నిరంతరం పేదల పక్షాన పోరాటం చేస్తామన్నారు. సీపీఐ నాయకులు ఎల్‌పీ రమణ, బాబు, సిద్దయ్య, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

శబరిమలకు సైకిల్‌యాత్ర



సైకిల్‌యాత్రను ప్రారంభిస్తున్న గురుస్వామి విజయ్‌కుమార్

ధర్మవరం అర్బన్: ధర్మవరం నుంచి శబరిమలకు అయ్యప్ప మాలధారులు సైకిల్‌యాత్ర చేపట్టారు. పట్టణంలోని చెరువుకట్ట వద్దనున్న అయ్యప్పస్వామి భజన మందిరంలో ఆదివారం గురుస్వామి పీజే విజయ్‌కుమార్ అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం 18 మంది అయ్యప్పమాలధారులు సైకిల్‌పై శబరిమలకు బయలుదేరారు. హిందూ సంప్రదాయాలను మరింత విస్తరింపజేయడానికి కార్యక్రమాన్ని చేపట్టినట్లు గురుస్వామి విజయ్ కుమార్ తెలిపారు. వారంరోజుల్లోపు శబరిమలకు చేరుకుంటారని తెలిపారు. మాలధారులు లోకేష్, మణికంఠ, ఓంకార్, ఓబులేసు, జగదీష్, తేజ, సుంకర చిన్న, మహేష్‌రెడ్డి, కుమార్, బాలు, నాగేంద్ర, కళ్యాణ్, తేజ, వంశీ, ప్రవీణ్ పాల్గొన్నారు.

కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్



బెల్టులు సాధించిన విద్యార్థులతో కరాటే మాస్టర్ ఇనాయత్‌బాషా

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కొత్తపేట మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో ఆదివారం మల్టీస్టార్ బుడోకాన్ కరాటే అకాడమీ కరాటే మాస్టర్ ఇనాయత్ బాషా ఆధ్వర్యంలో బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ నిర్వహించారు. మాంగళ్య శిల్క్స్ నిర్వాహకులు జింకా పురుషోత్తం, సీనియర్ బ్లాక్ బెల్టు సాధించిన వారు హస్విక, అబుబకర్ కరాటేలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఎల్లో, ఆరెంజ్, గ్రీన్, బ్లూ, పర్పుల్, బ్రౌన్ బెల్టులతో పాటు ప్రశంసా పత్రాలు అందించారు. ప్రతి ఒక్కరూ కరాటే నేర్చుకుంటే ఆత్మరక్షణకు ఉపయోగపడుతుందన్నారు.

సత్యసాయి సేవాదళ్ సభ్యులకు భోజన ప్యాకెట్ల అందజేత



సేవాదళ్ సభ్యులకు భోజన ప్యాకెట్లు అందిస్తున్న సత్యసాయి సేవా సమితి సభ్యులు

ధర్మవరం అర్బన్: పాడేరు నుంచి పుట్టపర్తికి వస్తున్న 210 మంది సేవాదళ్ సభ్యులకు ధర్మవరం రైల్వేస్టేషన్‌లో ఆదివారం సత్యసాయి సేవా సమితి కన్వీనర్ నామా ప్రసాద్ ఆధ్వర్యంలో భోజన ప్యాకెట్లు పంపిణీ చేశారు. పుట్టపర్తికి వెళ్లే భక్తులకు భోజన వసతి కల్పించినట్లు ఆయన తెలిపారు. రైల్వే స్టేషన్ మాస్టర్ నరసింహానాయుడు సత్యసాయి సేవా సమితి సేవలు అభినందనీయమన్నారు.